సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం ׀ 11 ׀ జూలై ׀ 2025



ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ

ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. 8లో▸



పోలింగ్ సరళిపై అవగాహన

బాలాపూర్ రెవెన్యూ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 8లో▸



ఆటో.. రూట్ ఎటో!

నగరంలో ఆటోపర్మిట్ల దోపిడీ పర్వం మొదలైంది. ఆటోరిక్షాల షోరూంలలో డ్రైవర్ల నమోదు ప్రక్రియ చేపట్టారు. 8లో▸

నేడు శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌తో 'ఫోన్ ఇన్'

శంకర్‌పల్లి: మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో భాగంగా 'సాక్షి' ఆధ్వర్యంలో శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ ఎ.యోగేశ్‌తో ఫోన్ ఇన్ కార్యక్రమం ఉంటుంది. మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఆయా వార్డుల్లోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావచ్చు. సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.



అంశం: మున్సిపల్ పరిధిలోని సమస్యలు
మున్సిపాలిటీ: శంకర్‌పల్లి
కమిషనర్: ఎ. యోగేశ్
తేదీ: 11- 07- 2025 (శుక్రవారం)
సమయం: ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
73311 27776, 96764 84485

న్యూస్‌రీల్

ఆడిట్ బృందం ఆకస్మిక తనిఖీలు



తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో గురువారం డిస్ట్రిక్ట్ స్పెషల్ ఆడిటర్ మహ్మద్ ఖాజా బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా పలు వార్డుల్లో చేపడుతున్న రోడ్ల శుభ్రత, వాటర్ ట్యాంకులు, డివైడర్లపై మొక్కలు, ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల నిర్వహణ, వంటశాలలు, మరుగుదొడ్లు, కంపోస్టు యార్డుల నిర్వహణ, తడి, పొడి చెత్తను వేరుచేయడం, వనమహోత్సవంలో నాటిన మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా కోహెడ ప్రభుత్వ పాఠశాలలో ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ కాలుష్యం వంటి అంశాలపై నిర్వహించిన స్వచ్ఛత పోటీల్లో గెలిచిన వారికి మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వినయ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ సురేష్ పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణల తొలగింపు



హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం కోహెడలోని తాళ్లకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను గురువారం ఇరిగేషన్ అధికారులు కూల్చివేశారు. సర్వే నంబర్ 883, 886లలో విస్తరించి ఉన్న చెరువు ఎఫ్టీఎల్‌లో రెండు ప్లాట్లలో ప్రహరీలు నిర్మించారు. సమాచారం అందుకున్న ఇరిగేషన్ ఏఈ వంశీ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందితో కలిసి జేసీబీ సాయంతో వాటిని కూల్చివేశారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ.. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టినా, కాలువలను పూడ్చివేసినా చర్యలు తప్పవని అన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఎంఈఓ ఆఫీసుకు తాళం వేసి ఆందోళన



ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి కార్యాలయానికి కార్మికులు తాళం వేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న మాట్లాడుతూ.. ఏడాదిగా బిల్లులు, గౌరవ వేతనం చెల్లించడం లేదని అన్నారు. గుడ్లు, రాగి జావ పెట్టాలని ప్రభుత్వం చెబుతోంది తప్ప అందుకు తగ్గ నిధులు మంజూరు చేయడంలేదన్నారు. అప్పులు చేసి గుడ్లు తీసుకొచ్చి పెడుతున్నప్పటికీ బిల్లులు ఇవ్వడం లేదన్నారు. ఎంఈఓ, ఎస్‌టీఓ, కలెక్టర్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా మోక్షం కలగడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఎస్ఐ నాగరాజు ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పి తాళం తీయించారు. ఎస్ఎఫ్ఐ, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు ఆందోళనకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ కన్వీనర్ ఎల్లేశ్, కార్మికులు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశం

సమస్యలన్నీ.. పరిష్కరిస్తాం

అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ వెంకటేశం
- ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన

చేవెళ్ల: అందరికీ అందుబాటులో ఉంటూ.. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ.. మున్సిపాలిటీని అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేస్తానని చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశం అన్నారు. మున్సిపల్ పరిధిలో సమస్యలు.. పరిష్కార మార్గాలపై 'సాక్షి' ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను స్థానికులు కమిషనర్ దృష్టికి తెచ్చారు. వాటిని సావధానంగా ఆలకించిన ఆయన వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రశ్న: మల్కాపూర్ వార్డుకు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. నీటి సమస్య ఉంది. చెత్త సేకరణ సక్రమంగా చేయడం లేదు.
– గోపాల్‌రెడ్డి, వెంకటేశ్, మాణిక్యరెడ్డి (మల్కాపూర్)

కమిషనర్: పారిశుద్ధ్య, నీటి సమస్యలు వెంటనే పరిష్కరించేలా అధికారులను ఆదేశిస్తా. రోడ్డు సమస్యకు సంబంధించి నిధులు వచ్చిన వెంటనే పరిష్కారం అవుతుంది.

ప్రశ్న: మున్సిపల్ పరిధిలో మిషన్ భగీరథ సమస్యలు ఉన్నప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలు లేక ఇబ్బంది ఏర్పడుతోంది. టెంపుల్ కమాన్ వద్ద ఎప్పుడూ వర్షపు నీరు నిలువ ఉంటోంది. వచ్చిపోయే వారికి ఇబ్బందిగా మారింది. ఏ సమస్యకు ఎవరిని సంప్రదించాలో తెలియజేస్తే బాగుంటుంది.
– బురాన్ ప్రభాకర్ (హౌసింగ్‌బోర్డు కాలనీ)

జవాబు: ఆయా సమస్యలపై తక్షణమే చర్యలు చేపడతాం. మీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం. మున్సిపల్ పరిధిలోని అధికారుల వివరాలను ప్రత్యేకంగా సోషల్ మీడియా గ్రూప్ ఏర్పాటు చేసి ప్రజలకు తెలిసేలా చూస్తాం.

ప్రశ్న: ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాం. దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్‌ఓసీ వచ్చింది. ఎఫ్‌టీఎల్ అని డ్యాక్యుమెంట్ పెండింగ్ అంటూ సమస్యలు వస్తున్నాయి.
– మంగలి నర్సింలు, రంగారెడ్డి (దేవునిఎర్రవల్లి), జనార్దన్‌రెడ్డి (పలుగుట్ట), ఎం.డీ.ఇబ్రహీం (కిష్టారెడ్డినగర్), శ్రీనివాస్‌రెడ్డి (ఇంద్రారెడ్డినగర్)

జవాబు: టెక్నికల్‌గా కొన్ని సమస్యలు ఉన్నాయి. అవి పైనుంచి క్లియర్ చేయాల్సి ఉంది. మా పరిధిలో ఉన్నవాటిని పెండింగ్‌లో లేకుండా చూస్తున్నాం. టౌన్ ప్లానింగ్ అధికారి ద్వారా సమస్యలు పరిష్కరించేలా చూస్తాం.



ప్రజల సమస్యలను నమోదు చేసుకుంటున్న సిబ్బంది



ప్రశ్న: వీధిలైట్లు వెలగడం లేదు. చెత్త సేకరణ సిబ్బంది రావడం లేదు. డ్రైనేజీ తరచూ జామ్ అవుతున్నా పట్టించుకోవడం లేదు. సీసీ రోడ్డు లేక ఇబ్బందులు ఉన్నాయి.
– సుశాంత్, వై.శ్రీనివాస్, ఎండీ నసీర్‌ఖాన్ (రంగారెడ్డి కాలనీ)

జవాబు: సిబ్బందిని పంపించి సమస్యలను పరిశీలిస్తాం. త్వరలోనే వాటిని పరిష్కరిస్తాం.

ప్రశ్న: నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. జాబితాలో పేరు వచ్చింది కానీ ప్రొసీడింగ్ ఇవ్వలేదు. ఇల్లు కట్టుకోవచ్చా.
– ఎండీ చాన్‌పాషా (ఇబ్రహీంపల్లి)

జవాబు: ఇల్లు మంజూరైతే తప్పకుండా ప్రొసీడింగ్ వచ్చి ఉండాలి. ఎందుకు రాలేదో తెలుసుకుంటాను. మీరు కూడా మరోసారి చెక్ చేసుకోండి. రాకపోతే తప్పకుండా ఇప్పిస్తాం.

ప్రశ్న: మా వార్డులో వీధి లైట్లు వెలగడం లేదు. ఇనుప స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. గేట్ నుంచి రోడ్డు గుంతలమయంగా మారింది. రాత్రిళ్లు ప్రయాణం ఇబ్బందిగా ఉంది.
– రజినీకాంత్ (దామరగిద్ద)

జవాబు: మీ వార్డులో ఇటీవలే పర్యటించాను. సమస్యలు దృష్టికి వచ్చాయి. ఇనుప స్తంభాలు తొలగించే చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డు మరమ్మతులపై సంబంధిత అధికారులకు నివేదిస్తాం.

ప్రశ్న: మా వార్డులో వీధి లైట్లు వెలగడం లేదు. సీసీ రోడ్లు లేవు.
– రాంచందర్, గీత (గ్రీన్ సిటీ)

జవాబు: సమస్యలు నోట్ చేసుకున్నాం. పరిశీలించి చర్యలు చేపడతాం.

ప్రశ్న: మెయిన్‌రోడ్డుపై డ్రైనేజీ లేక ఇబ్బందులు ఉన్నాయి. లేబర్ గుడిసెలు వేసుకొని కాలనీలను అపరిశుభ్రం చేస్తున్నారు.
– కృష్ణ, రాజు (వీరభద్రకాలనీ)

జవాబు: సమస్యలు ఉన్న కాలనీల్లో పర్యటించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం.

ప్రశ్న: డ్రైనేజీ సమస్య ఎక్కువైంది. నిత్యం లీక వుతోంది.
– సత్యనారాయణ, అమీర్ (భగత్‌సింగ్‌కాలనీ)

జవాబు: పరిశీలన చేసి పరిష్కరిస్తాం.

ప్రశ్న: వార్డులో రోడ్డు సమస్య ఉంది. తాగునీరు రావడం లేదు. జంగంగుట్ట వద్ద ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో చెత్త డంపింగ్ చేస్తుండడంతో నీళ్లు కలుషితం అవుతున్నాయి.
– చంద్రశేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి (పలుగుట్ట)

జవాబు: రోడ్డు సమస్యను సంబంధిత అధికారులకు నివేదిస్తాం. డంపింగ్ యార్డు కోసం స్థల అన్వేషణ చేస్తున్నాం.

ప్రశ్న: వారం రోజులుగా కరెంట్ సమస్యతో నీళ్లు రావడం లేదు. వీధి లైట్లు వెలగడం లేదు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారు.
– మాల్లారెడ్డి, శ్రీకాంత్, వెంకటేశ్ (పామెన)

జవాబు: వార్డులో తప్పకుండా పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తాం. కరెంట్ సమస్యపై విద్యుత్ అధికారులకు సమాచారం ఇస్తాం.

ప్రశ్న: కుక్కల బెడద, కోతుల బెడద ఎక్కువ అవుతోంది.
– రవీందర్ (హౌసింగ్ బోర్డు కాలనీ)

జవాబు: మున్సిపల్ పరిధిలో ఇలాంటి సమస్యలు ఎక్కడున్నా గుర్తించి ఏం చేయాలో నిర్ణయిస్తాం. తప్పకుండా చర్యలు తీసుకుంటాం.



జనాభా.. గబగబా!

- జిల్లాలో శరవేగంగా పెరుగుతున్న ప్రజలు
- ఉపాధి, ఉద్యోగావకాశాల కోసం భారీగా రాక
- ఆ తర్వాత ఇక్కడే స్థిర నివాసం
- 2011తో పోలిస్తే 2025లో రెండింతలు
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఉద్యోగ, ఉపాధి నిమిత్తం జిల్లాకు వచ్చి స్థిరపడుతున్న వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. జనాభాతో పాటే నిర్మాణాలు కూడా భారీగా పెరిగాయి. పల్లెలు, పట్టణాలకు తేడా లేకుండా పోయింది. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 24,46,265 మంది ఉండగా.. వీరిలో 12,54,184 మంది పురుషులు, 11,92,081 మంది మహిళలు ఉన్నారు. ఐటీ అనుబంధ సంస్థలు, రియల్ ఎస్టేట్, భారీ పరిశ్రమలతో 13 ఏళ్ల వ్యవధిలోనే జిల్లా జనాభా డబుల్ (48 లక్షలు) అయ్యింది.

భారీగా పెరిగిన వలసలు

2023 నవంబర్‌లో ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం 18 ఏళ్ల పైబడిన వారి సంఖ్య 35,23,219 చేరుకుంది. వీరిలో 18,23,165 మంది పురుషులు ఉండగా, 16,99,600 మంది మహిళలు, 454 మంది థర్డ్ జెండర్లు ఉన్నారు. వీరు కాకుండా 18 ఏళ్లలోపు వారు మరో 12.50 లక్షల మంది ఉన్నట్లు అంచనా. అత్యధిక జనాభా ఉన్న నియోజకవర్గాల జాబితాలో శేరిలింగంపల్లి మొదటి స్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో ఎల్బీనగర్, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం జనాభాలో 18 ఏళ్లలోపు వారు 12.50 లక్షల మంది ఉండగా, ఆ తర్వాతి వయస్కులు 35 లక్షల మందికిపైగా ఉండటం గమనార్హం. పెరిగిన నిత్యావసరాల ధరలు, వైద్య ఆరోగ్య ఖర్చులు, పిల్లల చదువులకు భారీగా ఖర్చవుతుండటంతో మెజార్టీ యువత ఒకరు లేదా ఇద్దరితోనే సరిపెట్టుకుంటున్నప్పటికీ.. వలసల కారణంగా జనాభా అనూహ్యంగా పెరుగుతూనే ఉంది. 2011లో 5,63,565 నివాసాలు ఉండగా, 2025 నాటికి గృహ విద్యుత్ కనెక్షన్ల సంఖ్య ఆధారంగా 13,22,646 చేరింది. మరోవైపు ఉమ్మడి కుటుంబాల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఒక్కో ఇంట్లో ఆరు నుంచి ఎనిమిది మంది ఉండగా, ప్రస్తుతం సగటున ముగ్గురు నుంచి నలుగురు మాత్రమే ఉంటున్నారు.

వయసుల వారీగా పరిశీలిస్తే..

- ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 18 నుంచి 19 ఏళ్ల వయసు ఉన్న వారు 92,540 మంది ఉండగా, 20 నుంచి 29 ఏళ్ల వయసు ఉన్న వారు 6,37,940 మంది ఉన్నారు. 30 నుంచి 39 ఏళ్ల వయసు ఉన్న వారు 10,73,733 మంది, 40 నుంచి 49 ఏళ్ల వయసు ఉన్న వారు 7,77,548 మంది ఉన్నారు. 50 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న వారు 4,77,325 మంది ఉండగా, 60 నుంచి 69 ఏళ్ల వారు 2,81,235 మంది ఉన్నారు. 70 నుంచి 79 ఏళ్ల వయసు వారు 1,38,324 మంది, 80 ఏళ్లు పైబడిన వారు 43,775 మంది ఉండడం గమనార్హం.
- వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఏటా సగటున 42 వేల ప్రసవాలు జరుగుతున్నట్లు అంచనా. వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెరగడం, ఆరోగ్య సూత్రాలు పాటిస్తుండటం, అనేక ఆస్పత్రులు అందుబాటులోకి రావడంతో సగటు మనిషి ఆయుఃప్రమాణం భారీగా పెరిగింది. 60 ఏళ్లు దాటిన వృద్ధులు 4.63 లక్షల మందికిపైగా ఉండడం విశేషం.
- వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం డేటా ప్రకారం ఐదేళ్లలోపు పిల్లలు సుమారు రెండున్నర లక్షల మంది ఉన్నట్లు అంచనా.
- విద్యాశాఖ లెక్కల ప్రకారం ఆరు నుంచి 14 ఏళ్లలోపు వారు 7.50 లక్షల మంది ఉన్నట్లు అంచనా. 15 నుంచి 17 ఏళ్ల వయసు ఉన్న వారు (ఇంటర్మీడియెట్/డిగ్రీ కోర్సులు చదువుతున్నవారు) రెండున్నర నుంచి మూడు లక్షల మంది ఉన్నట్లు అంచనా.

టీఎన్జీవీఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక

కేశంపేట: తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నరీ అసోసియేషన్ (టీఎన్జీవీఏ) జిల్లా ఎన్నికలు హైదరాబాద్ సీతరాంబాగ్‌లోని సంఘం రాష్ట్ర భవనంలో జరిగాయి. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బింగి సురేష్ అధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో జిల్లాలోని 96 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా రాజీవ్ పైలెట్, కార్యదర్శిగా భరత్‌చారి, అసోసియేట్ అధ్యక్షుడిగా ఆనంద్, కోశాధికారిగా శివకుమార్ గెలుపొందారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రాజీవ్ పైలెట్ మాట్లాడుతూ.. వెటర్నరీలో నాన్ గెజిటెడ్ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి అభిషేక్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రతన్, ట్రెజరీ సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర కమిటీ నాయకులు



స్వామి నిఖిలేశ్వరానంద పాదుకలకు పూజ చేస్తున్న గురూజీ దంపతులు

వైభవంగా గురుపూర్ణిమ మహోత్సవం

కందుకూరు: గురువు సూచించిన మార్గంలో నడిస్తే భగవంతుడి కృప త్వరగా ప్రాప్తిస్తుందని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి అన్నారు. మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో గురువారం గురు పూర్ణిమ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి నిఖిలేశ్వరానంద విగ్రహానికి అభిషేకం, పాదుకా పూజలు చేశారు. అనంతరం గురూజీకి తులాభారం వేశారు. గురూజీ సాధకులతో ప్రత్యేకంగా సాధనలు చేయించి గురు పూర్ణిమ విశిష్టతను వివరించారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వేడుకలకు హాజరైన భక్తులు

కొనసాగుతున్న ప్లాట్ల కేటాయింపు



లాటరీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న సీపీ సుధీర్‌బాబు, డీసీపీ సునీతారెడ్డి తదితరులు

కందుకూరు: ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు మండలంలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో లాటరీ ద్వారా చేపట్టిన ప్లాట్ల పంపిణీ కార్యక్రమం గురువారం నాలుగో రోజు కొనసాగింది. కందుకూరు, ఇబ్రహీంపట్నం ఆర్డీఓలు జగదీశ్వర్ రెడ్డి, అనంత్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 242 గజాలు, 302 గజాలకు సంబంధించిన ప్లాట్లను లాటరీ ద్వారా రైతులకు కేటాయించారు. శుక్రవారం అన్ని గ్రామాలకు సంబంధించి 363 గజాలు, 423 గజాలు, 484 గజాలు, 544 గజాలు పొందినవారికి ప్లాట్లు కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు.

లాటరీ ప్రక్రియను పరిశీలించిన సీపీ

లాటరీ ద్వారా ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను గురువారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు పరిశీలించారు. ప్లాట్ల పంపిణీ, బందోబస్తును పర్యవేక్షించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ తదితర అంశాల గురించి అధికారులను ఆరా తీశారు. శాంతిభద్రతలకు ఆటంకం కలుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, అదనపు డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వానిది భూ దందా



ఎనికేపల్లి రైతులకు సంఘీభావం తెలిపిన బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్

మొయినాబాద్: భూ దందా చేయడానికే ప్రభుత్వం పేదల భూములు గుంజుకుంటోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్ ఆరోపించారు. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లిలో ధర్నా చేస్తున్న రైతులకు గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోశాలకు ఇవ్వడానికి ప్రభుత్వానికి పేదలు సాగుచేసుకునే భూములే దొరికాయా..? ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు చాలా ఉన్నాయి.. వాటిలో ఏర్పాటు చేస్తే ఏమవుతుంది అని ప్రశ్నించారు. కోకాపేటలో ఉన్న గోశాలను ఎనికేపల్లికి తరలించి అక్కడి భూములను ప్రభుత్వం అమ్మడానికి చూస్తోందన్నారు. దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూములను వదిలిపెట్టొద్దని.. రైతుల పోరాటానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సన్‌వల్లి ప్రభాకర్‌రెడ్డి, కిసాన్ మోర్చ జిల్లా కార్యదర్శి మోర నర్సింహారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నియోజకవర్గం కన్వీనర్ వెంకటేశ్‌గౌడ్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు క్యామ పద్మనాభం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా స్వేచ్ఛను అడ్డుకోవద్దు

- తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమంలో మీడియా పాత్ర ఎంతో కీలకం
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను అడ్డుకునే హక్కు ఎవరికీ లేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్ హాలులో టీడబ్ల్యూజేఎఫ్ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేందర్‌గౌడ్, నరేశ్, నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛ' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. నాటి స్వాతంత్ర్య ఉద్యమంతో పాటుగా తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో మీడియా పాత్ర ఎంతో కీలకమన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రజాస్వామ్యంలో మీడియాను నాలుగో స్తంభంగా గుర్తించడంతో పాటుగా పూర్తి స్వేచ్ఛను కల్పించాయన్నారు. గత ప్రభుత్వం మీడియా విలువలకు తిలోధకాలను ఇస్తూ పాత్రికేయుల హక్కులను కాలరాసిందని ఆరోపించారు. సమాజంలో జరుగుతున్న నిజాలను రాస్తే కొందరు నాయకులు జీర్ణించుకోలేక హత్యలు, దాడులు చేయడం, కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రాతికేయులు అసత్యాలను కాకుండా నిజాలను నిర్భయంగా రాయాలని, అప్పుడే వారికి సమాజం అండగా నిలబడుతుందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నర్సింలు మాట్లాడుతూ.. గతంలో పత్రికకు ఎంతో విలువ ఉండేదని, వచ్చిన వార్తలకు స్పందించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకునే వారమన్నారు. ఇప్పుడు పత్రికలలో వార్తలు రాస్తే దాడులు, కేసులు, బెదిరింపులకు పాల్పడే సంస్కృతి పెరిగిందని, ఇది సరికాదని హితవు పలికారు. జర్నలిస్టులు తమ స్వేచ్ఛను సక్రమంగా వినియోగించుకోవాలని, దుర్వినియోగం చేయొద్దని సూచించారు. సమావేశంలో నేతలు రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, ఎండీ.ఇబ్రహీం, శ్రీనునాయక్, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, చెంది మహేందర్‌రెడ్డి, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, ప్రశాంత్, రాజా వరప్రసాద్, రాజు, నర్సింహ, బీసీసేన నాయకులు చంద్రశేఖరప్ప, జక్కుల జలజ, జయ శ్రీకాంత్, భాగ్యలక్ష్మి, స్రవంతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న నాగేందర్‌రెడ్డి

శంకర్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. గురువారం మండలంలోని పిల్లిగుండ్ల గ్రామ శివారులో యూత్ కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు మహిపాల్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ సమావేశం ఏర్పాటు చేయగా.. నాగేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వచ్చే ఏ ఎన్నికల్లో అయినా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అదేవిధంగా పార్టీ సిద్ధాంతాలను గడపగడపకూ చేరేలా చూడాలన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, పార్టీ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌లతో సమన్వయం చేసుకుంటూ యువత ముందుకు సాగాలని కోరారు. యూత్ కాంగ్రెస్‌లో ఎవరికైనా సమస్యలు ఉంటే, జిల్లా నాయకత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి అరవింద్, అసెంబ్లీ ఇన్‌చార్జి వసీం, మండల అధ్యక్షుడు బొల్లారం ప్రశాంత్‌రెడ్డి, నాయకులు సంజయ్, దయాగౌడ్, నర్సింహారెడ్డి, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

మొయినాబాద్: గుండెపోటుతో ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం షాజాపూర్‌కు చెందిన మాబారిఖాన్ సత్తార్ ఖాన్(38) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు గోధుమల లోడ్‌తో మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వీఎస్‌జే అగర్వాల్ ఫుడ్స్ మిల్లుకు వచ్చాడు. అన్‌లోడింగ్ కోసం లారీని క్యూలో పెట్టి అందులోనే పడుకున్నాడు. బుధవారం రాత్రి వరకు లారీని ముందుకు కదిలించకపోవడంతో మరో లారీ డ్రైవర్ అర్జున్‌సింగ్ అతని వద్దకు వెళ్లి గమనించాడు. ఎంత పిలిచినా లేవకపోవడంతో సెక్యూరిటీ గార్డు హృదయ్ రంజన్ బెహెరాకు చెప్పాడు. అతడు వెళ్లి చూడగా చనిపోయి ఉన్నాడు. విషయాన్ని సూపర్ వైజర్‌కు ఖియాన్‌కు చెప్పి మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి గుండెపోటుతో మరణించినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

యాచారం: మండల పరిధి తాడిపర్తి గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొక్కా నారాయణరెడ్డి(80) బుధవారం రాత్రి మృతి చెందాడు. ఆయన రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి, అనంతరం ప్రజాప్రతినిధిగా ప్రజాసేవ చేశారు.

కిలో గంజాయి పట్టివేత

ఇద్దరు యువకుల అరెస్టు

మొయినాబాద్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మొయినాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.075 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బంగాలిగూడకు చెందిన సున్నం మధు, చేవెళ్ల మండలంలోని దామరగిద్దకు చెందిన కొత్తమల్లె వెంకటేష్ జేబీఐఈటీ కళాశాల పరిసరాల్లో గంజాయి అమ్ముతున్నట్లు గురువారం మొయినాబాద్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు జేబీఐఈటీ కళాశాల పరిసరాల్లోకి వెళ్లి పరిశీలించగా ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. వెంటనే వారిని పట్టుకుని విచారించారు. వారి వద్ద నుంచి 1.075 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి గురువారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

నెల రోజుల్లో 25 మంది అరెస్టు

బాధితులకు రూ.3.67 కోట్లు రిఫండ్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గత నెలలో వివిధ సైబర్ నేరాలకు సంబంధించి ఇతర రాష్ట్రాల్లో ఆపరేషన్లు నిర్వహించారు. ఆయా కేసుల్లో బ్యాంకు ఖాతాలు అందించిన, సమకూర్చిన వారితో పాటు దళారులతో కలిపి మొత్తం 25 మందిని అరెస్టు చేశారు. మరోపక్క నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ అయిన మొత్తంలో రూ.3.67 కోట్లు బాధితులకు రిఫండ్ చేయించారు. పట్టుబడిన నేరగాళ్లపై దేశ వ్యాప్తంగా 453 కేసులు నమోదై ఉండగా.. రాష్ట్రంలోని వాటి సంఖ్య 66గా ఉంది. వారి నుంచి 34 మొబైల్ ఫోన్లు, 20 చెక్‌బుక్స్, 17 డెబిట్ కార్డులు, 8 సిమ్‌కార్డులు, 16 బ్యాంక్ పాస్‌పుస్తకాలతో పాటు రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. చైల్డ్ పోర్న్ వీడియోల కేసుల్లోనూ సైబర్ క్రైమ్ పోలీసులు 22 కేసులు నమోదు చేశారు. ఆయా నిందితులు నివసించే ప్రాంతాల్లోని ఠాణాలకు ఈ కేసులను బదిలీ చేయడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు.

ఆటో.. రూట్ ఎటో!

డీలర్ల అక్రమార్జన కోసమే 20 వేల ఎల్పీజీ, సీఎన్జీ పర్మిట్లు



- ఔటర్ వరకు ఈవీలంటూనే ఎల్పీజీకి అనుమతులు
- పాత ఆటోలకు ఈవీ రిట్రోఫిట్‌మెంట్‌లు
- న్యాయస్థానాన్ని ఆశ్రయించిన ఆటో సంఘాలు
- అడ్డగోలుగా ఇచ్చిన ఆటో పర్మిట్లలో అన్నీ లొసుగులే

సాక్షి, సిటీబ్యూరో: రాజధాని నగరంలో ఆటోపర్మిట్ల దోపిడీ పర్వం మొదలైంది. వారం రోజులుగా ఆటో రిక్షాల షోరూంలలో డ్రైవర్ల నమోదు ప్రక్రియ చేపట్టారు. మొదట వచ్చినవారికి మొదట కేటాయింపు (ఫస్ట్ టూ ఫస్ట్ కమ్) పద్ధతిలో జరుగుతున్న ఈ నమోదు వల్ల డ్రైవర్లు షోరూమ్‌లకు పరుగులు తీస్తున్నారు. కేవలం డ్రైవర్ల వివరాలను నమోదు చేసేందుకే సుమారు రూ.5000 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆటో రిక్షాల ధరలను బహిరంగంగా ప్రకటించకుండా డ్రైవర్లను నమోదు చేసుకోవడం వల్ల బ్లాక్ మార్కెటింగ్ జరిగే అవకాశం ఉన్నట్లు ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు ఔటర్‌రింగ్ రోడ్డు వరకు ఎలక్ట్రిక్ వాహనాలను మాత్రమే వినియోగించాలంటూనే మరోవైపు ఏకంగా 20 వేల సీఎన్జీ, ఎల్పీజీ ఆటోలకు అనుమతులను ఇవ్వడంలో ఆంతర్యమేమిటని పలు ఆటోసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ అంశంపై ఆటో సంఘాల నాయకులు న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించారు.

ఈవీలకు ప్రోత్సాహం ఏమైనట్టో..?

నగరంలోని ఆటోల స్థానంలో ఔటర్ వరకు పూర్తిగా ఎలక్ట్రిక్ ఆటోలను అందుబాటులోకి తేనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలోనే ప్రకటించారు. కేంద్రం రూపొందించిన ఈవీ పాలసీకి అనుగుణంగా ఎలక్ట్రిక్ ఆటోలకు పన్ను నుంచి మినహాయింపునిచ్చారు. ఒకవైపు ఈవీ పాలసీ కొనసాగుతుండగా కొత్తగా 65 వేల ఆటో పర్మిట్లకు అనుమతులను ఇవ్వడంలో మతలబు ఏంటని ఆటో సంఘాలు, పర్యావరణ సంస్థలు ప్రశ్నిస్తున్నాయి. కేవలం ఈవీల ముసుగులో 20 వేల ఎల్పీజీ, సీఎన్జీ ఆటోలను విక్రయించేందుకే ప్రభుత్వం ఈ పర్మిట్లను విడుదల చేసినట్లు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఎడాపెడా డ్రైవర్లను నమోదు చేసుకొన్న అనంతరం కొత్త ఆటోలకు కృత్రిమ కొరతను సృష్టించి భారీ ఎత్తున ధరలు పెంచేందుకు కొందరు డీలర్లు, ఫైనాన్షియర్లు ఇప్పటికే రంగం సిద్ధం చేసుకున్నట్లు ఆటో సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

పాతవాటికి రిట్రోఫిట్‌మెంట్ ఎందుకు?

అక్రమార్కులకు కొమ్ముకాసే విధంగా ఉన్న కొత్త పర్మిట్ల విధానం పూర్తి లోపభూయిష్టంగా ఉంది. ఒకవైపు ఈవీ పాలసీ కొనసాగుతుండగా కొత్తగా 20 వేల ఈవీలతో పాటు మరో 20 వేల ఎల్పీజీ, సీఎన్జీ ఆటోలకు అనుమతులను ఇచ్చారు. ఇవి కాకుండా 25 వేల పాత ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చుకొనేందుకు రిట్రోఫిట్‌మెంట్ అనుమతులను ఇచ్చారు. అక్రమార్కులకు కొమ్ముకాస్తూ విడుదల చేసిన ఆటోరిక్షా పర్మిట్ల పందేరంలో సామాన్య, నిరుపేద డ్రైవర్లే మరోసారి సమిధలుగా మారనున్నారు.

నమోదైన చోట కొనేందుకేనా...

ఆటోడ్రైవర్లు తెలంగాణలో ఎక్కడైనా కొనుగోలు చేయవచ్చునని ఆర్టీఏ విధివిధానాల్లో పేర్కొన్నారు. ఈ మేరకు షోరూమ్‌లలో రవాణాశాఖ లాగిన్ సౌకర్యం కల్పించారు. షోరూమ్‌ల వద్ద నుంచి వచ్చే డ్రైవర్ల వివరాల ఆధారంగా ఆర్టీఏ అధికారులు పర్మిట్లను విడుదల చేస్తారు.ఈ పర్మిట్లపైన సదరు డ్రైవర్ కొత్త ఆటోను కొనుగోలు చేసుకోవచ్చు. కానీ తమ వద్ద ఆటోను కొనుగోలు చేసే డ్రైవర్ల వివరాలను మాత్రమే షోరూమ్‌లలో నమోదు చేస్తున్నారు. ఇందుకోసం ముందస్తుగా రూ.5000 చొప్పున వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఒకవైపు ఇలా గుట్టుగా అక్రమాలు చోటుచేసుకుంటుండగా రవాణా అధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరించడం గమనార్హం.

లారీ, కారు ఢీ ఇద్దరి దుర్మరణం

- మృతుల్లో దిలావర్‌గూడ మాజీ సర్పంచ్, అతని బంధువు
- కొత్తూరు రైల్వే బ్రిడ్జిపై ప్రమాదం


చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

కొత్తూరు: లారీ, కారు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో మాజీ సర్పంచ్‌తో పాటు అతని బంధువు చనిపోయిన సంఘటన కొత్తూరు మున్సిపల్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం, దిలావర్‌గూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పరిగి చంద్రశేఖర్‌రెడ్డి (45), అతని బంధువు నందిగామ మండలం, దేవుని మామిడిపల్లికి చెందిన ఎర్రగుంట చంద్రశేఖర్‌రెడ్డి ఇంటికి వచ్చాడు. అనంతరం రాత్రి కారులో నందిగామ నుంచి కొత్తూరు రైల్వే బ్రిడ్జిపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చంద్రశేఖర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.


చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న సబితారెడ్డి

మాజీ మంత్రి నివాళి..

మహేశ్వరం: చంద్రశేఖర్‌రెడ్డి మృతి విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తదితరులు దిలావర్‌గూడకు చేరుకున్నారు. మృతుడికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, సుభాన్‌పూర్ మాజీ సర్పంచ్ గుత్తి పద్మ పాండు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్ తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


హరిప్రసాద్ (ఫైల్)

పహాడీషరీఫ్: యువకుడు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచాల మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన కేశగోని హరి ప్రసాద్(27) తుక్కుగూడలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. ఈ నెల 9వ తేదీన ఉదయం 9 గంటలకు డ్యూటీకి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన హరిప్రసాద్ సాయంత్రమైనా రాలేదు. అతడు ఫోన్‌లో కూడా అందుబాటులోకి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు సాధ్యమైన ప్రాంతాలలో వెతికినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై అతని తండ్రి స్వామి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో పడిన క్షతగాత్రులు

శంకర్‌పల్లి: ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ఓ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు స్నేహితులు రావత్(25), సమేహ(25) కలిసి గురువారం ఉదయం తమ ద్విచక్రవాహనంపై ఉద్యోగ రీ త్యా మోమిన్‌పేట్ వైపు వెళ్తున్నారు. అయితే మండలంలోని లక్ష్మారెడ్డిగూడ గేట్ వద్ద వికారాబాద్ డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో రావత్, సమేహకి బలమైన గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో రావత్ పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


ఆవు కళేబరం

షాబాద్: విద్యుదాఘాతంతో ఓ పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కేసారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి రవీందర్ తన పాడి ఆవును పొలంలో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్ తగిలి షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రోజుకు 12 లీటర్ల పాలు ఇచ్చే పాడి ఆవు మృతి చెందడంతో రైతు బోరున విలపించాడు. ప్రభుత్వం స్పందించి ఆర్థికసాయం అందజేయాలని కోరారు.

రైల్వే పట్టాల పక్కన మృతదేహం లభ్యం

కొత్తూరు: రైల్వే పట్టాల పక్కన ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన కొత్తూరు మున్సిపల్ పరిధి తిమ్మాపూర్ రైల్వేస్టేషన్‌సమీపంలో గురువారం వెలుగు చూసింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్ తెలిపిన వివరాల మేరకు.. రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాల పక్కన ఓ మృతదేహం పడి ఉందనే సమాచారంతో అక్కడికి చేరుకొని పరిశీలించారు. దాదాపు రెండు రోజుల క్రితం కదులుతున్న రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి కిందపడి మృతిచెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

జడ్సీ లాగిన్ ఓపెన్ చేసేందుకు యత్నం

విధుల నుంచి ఆపరేటర్ తొలగింపు

గచ్చిబౌలి: జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే లాగిన్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్‌లో సెక్షన్ రైటర్‌గా ఉన్న అభిలాష్ కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రెండు రోజుల క్రితం రాత్రి అతను శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్‌లో కమిషనర్ హేమంత్ బోర్ఖడే లాగిన్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నించాడు. జడ్సీ ఫోన్‌కు ఓటీపీ వెళ్లడంతో అప్రమత్తమైన ఆయన అంతర్గత విచారణ చేపట్టగా అభిలాష్‌కు చెందిన ఐడీగా నుంచి ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. అభిలాష్‌పై చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్ శ్యామ్ కుమార్ జోనల్ కమిషనర్‌కు లేఖ రాశారు. దీంతో జోనల్ కమిషనర్ సంబంధిత ఏజెన్సీకి అతడిని సరెండర్ చేశారు. జోనల్ కమిషనర్ లాగిన్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నించడం చర్చనీయాంశంగా మారింది. అవినీతికి కేరాఫ్‌గా మారిన టైన్‌ప్లానింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్, ప్రైవేట్ సిబ్బంది తరచూ అధికారుల లాగిన్‌లను వాడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఏసీబీ వలలో మహిళా పీఎస్ ఎస్‌ఐ

గచ్చిబౌలి: ఓ కేసులో పేరు తొలగించేందుకు డబ్బులు తీసుకుంటూ గచ్చిబౌలి ఉమెన్ పీఎస్ ఎస్‌ఐ వేణుగోపాల్ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే..కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ భర్తతో పాటు అత్తింటి వారిపై గచ్చిబౌలి మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇరు పక్షాలను పిలిచి మాట్లాడారు. గృహహింస కేసులో తల్లి పేరును తొలగించేందుకు ఎస్‌ఐ వేణు గోపాల్ రూ.25 వేలు డిమాండ్ చేశాడు. దీంతో సదరు మహిళ భర్త ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. గురువారం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ వేణుగోపాల్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ హైదరాబాద్ రేంజ్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో దాడి చేసిన పోలీసులు అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి రూ.25 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు.

పోలింగ్ సరళిపై అవగాహన


బీఎల్‌ఓలకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

బడంగ్‌పేట్: బాలాపూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం నేషనల్ ట్రైనింగ్ అండ్ ఆర్గనైజేషన్ ప్రోగ్రాం, బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా కుందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి హాజరై బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. పోలింగ్ రోజుకు ముందు పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఓటరు సమాచారం స్లిప్పులను వేరే వారికి ఇవ్వకుండా చూడాలని కోరారు. 1961 ఎన్నికల నిర్వహణ నియమాలు వివరిస్తూ బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. అలాగే 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో తహసీల్దార్ ఇందిరా దేవి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేనేజర్ నాగేశ్వర్ రావు, డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులను గుర్తించని ప్రభుత్వం


వ్యవసాయ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు

- గుర్తింపు కార్డుల జారీలో తీవ్రజాప్యం
- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట రమణారెడ్డి

ఇబ్రహీంపట్నం: రైతులను ప్రభుత్వం గుర్తించడం లేదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి ఆరోపించారు. వారికి గుర్తింపు కార్డుల ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. ఇబ్రహీంపట్నం వ్యవసాయ కార్యాలయం వద్ద గురువారం రైతులు, బీఆర్‌ఎస్ నేతలతో కలిసి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా రైతుల గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియను ప్రారంభించి రెండున్నర నెలలు గడుస్తున్నా.. రాష్ట్రంలో పది శాతం నమోదును ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో మీ సేవా, తదితర కేంద్రాల్లో రైతుల గుర్తింపు కార్డుల నమోదు చేస్తుంటే, ఇక్కడ పట్టించుకునే నాథుడే కరువైయ్యాడని పేర్కొన్నారు. కేవలం వ్యవసాయ విస్తరణాధికారికి మాత్రమే ఆన్‌లైన్ లాగిన్ ఇవ్వడంతో సగటున రోజుకు 40 మందికి మించి నమోదు చేయలేకపోతున్నట్లు తెలిపారు. గుర్తింపు కార్డులు లేకుంటే రైతుభరోసా, రైతుబీమా, పీఎం కిసాన్ లాంటి పథకాలు నిలిచిపోతాయనే ఆందోళన రైతుల్లో వ్యక్తం అవుతుందన్నారు. మీ సేవ కేంద్రాల్లో రైతు గుర్తింపు నమోదుకు అవకావం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చిలుకల బుగ్గరాములు, నిట్టు జగదీష్, సుధాకర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, మైసయ్య, మహేందర్, గోపాల్,శంకరయ్య, చంద్రశేఖర్, శ్రీశైలం , శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

దొరకని విద్యార్థి ఆచూకీ

మొయినాబాద్: గురుకుల కళాశాల నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ ఇంత వరకు లభించలేదు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థి సున్నల్ పవన్(17) బుధవారం ఉదయం కళాశాల నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసిన పోలీసులు విద్యార్థి ఎక్కడికి వెళ్లాడనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కళాశాల సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా విద్యార్థి ఆర్టీసీ బస్సు ఎక్కినట్లు కనిపించింది. కానీ బస్సు ఎక్కడ దిగాడనే విషయం మాత్రం స్పష్టం కాలేదు. విద్యార్థి సొంతూరు కామారెడ్డి జిల్లా మాదాపూర్‌కు వెళ్లాడేమోనని తల్లిదండ్రులకు సైతం ఫోన్ చేశారు. కానీ ఇంత వరకు అక్కడికి వెళ్లలేదని వారు చెబుతున్నారు. విద్యార్థి ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.